# సేవాపరాయణుడు

## మా గోఖలే

గురూజీగారి లోకబంధు పత్రిక, లోకబంధు ప్రెస్సు, లోకబంధు బుక్ పబ్లిషింగ్సు వగైరా సంస్థలో నాలుగు నెల్ల కిందటే వందరూపాయల వుద్యోగానికి కుదురుకున్న గుర్నాధానికి, ఓరోజు బాంబుగుండు పేల్నట్టు యింకో వందరూపాయలు యింక్రిమెంటయింది.

ఈ సంఘటనపై ఏ మనస్తత్వ పరిశీలకుడైనా గుర్నాధం మనసులో ఏం జరుగుతున్నదీ పరిశీలించ పూనుకోడం ఏమంత తెలివైన పనికాదు.

ఎందుకంటే తను గురూజీగారికి ఏ యింత లాభసాటి పనో చేసి, ఆయనచేత అమాంతం యింత యింక్రిమెంటు యిప్పించుకునే సందర్భంలో ఆయనకు స్వల్పంగానైనా శ్రమ కలిగించి వుండొచ్చని గుర్నాధం తన్ను తను ఎన్నయినా తిట్టుకుంటాడు కూడా.

ఏమైనా గురూజీగారికీ, గురూజీ కుటుంబానికీ, కుటుంబ పరివారానికీ కృతజ్ఞత తెలుపుకోంది తన మనసు శాంతించ దనుకున్నాడు గుర్నాధం. అందుకే- బీదగా వుందనుకున్నా సరే- రెండు డజన్ల యాపిళ్ళూ, రెండుంబాతిక శేర్ల పచ్చి కిసుమిసూ, యింకొన్ని వగైరాల్ని బుట్టలోవేసుకుని గురూజీ బంగళాకు బయలుదేరాడు.

గుర్నాధంభార్య దుర్గాభవాని వెంకాయమ్మ గుమ్మందాకా వచ్చి "మరీ నీరసంగా వుంటున్నారు, రెండుమూడు యాపిళ్ళో, కాసిని కిసుమిసో వుంచుకుని పోరాదూ ?" అని అనిచూసింది.

నిజానికి వొంటికి మంచిచేసే ఖరీదుగల వేట్నయినా పచ్చి విషంగా తన పెనిమిటి జమకడ్తాడని తెలిసినా, యీ సందర్భంలో అడిగిచూసింది దుర్గాభవాని వెంకాయమ్మ.

కాని గుర్నాధం పిడిరాయివంటి మనిషి "ఏమిటీ? యాపిలుపళ్లూ కిస్మిసా ? నీకేమన్నా మతిపోయిందా ఏం ? నా జన్మలో యింట్లాంటివి తిననని నీ కెన్నిసార్లు చెప్పానూ ?" అన్నాడు గుర్నాధం.

"బాగుంది వాట్ని మనంగా మనం కనుక్కోలేదుగా ! వారి కెట్లాగో యిస్తున్నాం గనక రెండు వుంచమన్నాను!" అంది దుర్గాభవాని వెంకాయమ్మ.

"కొన్నాం! కనుక చస్తామా ? ఆ మహారాజులు వీట్నితప్ప తినరు గనక కొన్నాం! లక్ష చెప్పు! నాలుక పీకినాసరే వీట్ని తిననూ, తినేందుకు నా చేయి రాదు!" అన్నాడు గుర్నాధం దులిపేసుకుని బుట్టతో వీధిలోకొస్తూ.

"గుర్నాధంగారా ? పొద్దున్నే పెద్ద బరువు మీద వేసుకున్నారే?" అన్నాడు గురూజీ సంస్థలో యింకో వుద్యోగయిన సీతాపతి, గుర్నాధాని కెదురై.

"ఎబ్బే మనవేపు మాగాణీ ఒంకాయలు! ఎవరో స్నేహితుడు పడేసి పోతేనూ కాసిని మన గురూజీగారికి రుచి చూపిద్దామనీ-" అనేశాడు గుర్నాధం.

"అన్నట్టు మీకు యింక్రిమెంటిచ్చారట్టగా? బియ్యేఫస్టున పాసై పదేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నా నా దౌర్భాగ్యాని కేనాడూ యింత అదృష్టం పట్టలేదు. అయినా మీ అదృష్టానికి సంతోషించకుండా వుండలేను" అన్నాడు సీతాపతి.

"మీ బుద్ధి మంచిది గనుక ఆ మాటన్నారు! నాకీ యింక్రిమెంటిచ్చినందుకు ఆఫీసులో ఎంతమంది ఎందుకు కళ్ళకు కారం రాసుకుంటున్నారో నా కర్థంకాకుండా వుంది. చూశారా మనవాళ్ళ తీరు ఎట్లా వుంటుందో? ఈ రకంగా వలవల ఏడవడం మానిపోయిన మర్నాడు మనజాతి బాగుపడ్తుంది! అసలు నాకీ యింక్రిమెంటిచ్చినప్పుడే గురూజీగారు నన్నో విషమపరీక్షకు గురిచేస్తున్నా డనుకున్నా. నలుగురు నాలుగురకాలుగా అనుకునేట్టు యిది గావడం ఏమిటోగా వుంటుంది చూడండి! ఆ మాటకువస్తే నా అదృష్టం నా చేతిలో వుందా ? ఆ గురూజీగారు యింత పెడ్తే తింటాం లేకుంటే నోరెత్తం ! ఈ వ్యాపారం వారిది చూడండి!" అన్నాడు గుర్నాధం.

"కావచ్చుగానీ మనం పడ్తున్న శ్రమకు లాభాలుంటున్నందువల్లే మనకు కొంత న్యాయంగా ముట్టవలసుంటుందని మన మెందుకనుకోగూడదూ?" అన్నాడు సీతాపతి.

"అబ్బో అవి పెద్దమాటలు! ఆ పిచ్చాలోచనలుండే మనం చెడుతున్నాం! నేను పెట్టుబడిపెట్టి

నా తెలివితేటల్తో లాభాలు సంపాయించుకుంటూ డబ్బు నా యిష్టప్రకారం వినియోగపర్చుకోవచ్చు నంటూరా లేదంటూరా? మనకు తెలివితేట లున్నయ్యీ కాని డబ్బులేదు. అందుకే మనం యింకోరి దగ్గిర వుద్యోగం చేసుకుంటున్నాం. అంతేగాని వారు బాగుపడ్తున్నారని ఆడిపోసుకుంటామా? ముఠాలుగట్టి వారిమీద తిరుగుబాటు చేస్తామా? ఎంత నీచం! ఎంత పాపం! పూర్తిగా తప్పుదారి! అన్నట్టు ముఠాలంటుంటే మంచి విషయం జ్ఞాపకం వచ్చింది! మన ఛీఫ్ కంపోజిటరు వెంకటేశ్వర్లు ఎంత తమాషా చేశాడో చూశారా?" అన్నాడు గుర్నాధం.

"అతన్ని పన్లోనుంచి గురూజీ డిస్మిస్ చేశార్టగా? పాపం పిల్లలుగలవాడు!" అన్నాడు సీతాపతి.

"వాణ్ణి పాపం తలచటం కూడా పాపమే! లుచ్ఛాపని! ఎంతద్రోహం చేశాడో చూశారా?" అన్నాడు గుర్నాధం.

"ఎవరికీ?" అనడిగాడు సీతాపతి.

"ఎవరికేమిటి! మన కంపెనీకీ, గురూజీకీ! ఏరుదాటి తెప్ప తగలబెట్టే రకం! ఆయన అన్నం తింటూ ఆయన్నే మోసం చేయటమా?" అన్నాడు గుర్నాధం.

"ఇంకా నయం! వెంకటేశ్వర్లు మీ దగ్గిర అప్పు చేసి ఎగవేశాడనుకున్నా!" అన్నాడు సీతాపతి.

"అంతకన్న ఘనకార్యమే చేశాడు! అసలు వాడిమీద పితూరీలు చెప్పి వాణ్ణి డిస్మిస్ చేయించింది నేనే నని అందర్తో టాంటాం గొడ్తున్నాట్ట! చూశారా యీ విచిత్రం?" అన్నాడు గుర్నాధం.

"అనే నేనూ విన్నాను" అన్నాడు సీతాపతి.

"ఇంకేం! మీదాకా గూడా వచ్చిందీ? అమ్మ పిడుగా! అసలు నేను వచ్చి నాలుగు నెల్లయినా గురూజీగారు నన్ను కాస్త యిదిగా చూట్టం మొదలు పెట్టేసరికి ఎంతమందికి ఎంతెంతగావుందో చిలుము మింగిన ట్టా మొహాలే చెబుతయ్! ఇదిగో నేను యిందాకనే అన్నానే? మనస్ఫూర్తిగా మనమెంత నమ్మకంగా గురూజీగారి పనిచేస్తే వారంత యిదిగానూ మనల్ని చూస్తారు. వీడున్నాడే - యీ వెంకటేశ్వర్లు? ఎంతడబ్బు పుట్టుడియంగా కాజేసేవాడో మీకు తెలుసా?" అన్నాడు గుర్నాధం, సీతాపతి మొహం దగ్గిరకొస్తూ.

"ఎవరిదీ?" అనడిగాడు సీతాపతి.

"ఇంకా ఎవరిదేమిటి! మన గురూజీగారిదే! ఓవరు టైము పనిచేసినట్టు నటించి ఓ వారంరోజులకు వాడికీ, యింకో పదిహేనుమంది వాడి ముఠాకూ ఓవర్ టైము వేసేశాడు!" అన్నాడు గుర్నాధం.

"నటించట మేమిటీ? మామూలు టర్నోవర్నిబట్టి ఓవర్ టైము పని సక్రమంగా జరిగిందీ లేందీ తెలిసి పోతుందిగా? యీ విషయం యివ్వాళ కొత్తకాదే" అన్నాడు సీతాపతి.

"ఇంకా నయం! అసలు మామూలు పనిగంటల్లోనే వీళ్లు సహాంపనే చేస్తుండిరి! ఇంక ఆ రోజు ఓవర్ టైము పనిచేసిందంతా కంపెనీకి దండగేగా? వెనక నేను వుద్యోగాని కొచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే యీ విషయం కనిబెట్టి గురూజీగారితో అని చూశా. అప్పుడు ఆయన నన్నదోరకంగా చూసె. ఆయన మటుకు సామాన్యుడా? ఆవలిస్తే ఎన్ని పేగులయిందీ లెక్క చెప్పేస్తాడు! పాపం పండినట్టే యీ వెంకటేశ్వర్లు దొంగ ఓవర్ టైముకు డిమాండుపెట్టి వాడి ముఠాతో స్ట్రయికు చేస్తానన్నాడు! సరే! ఎవరెంత చేసుకుంటే అంత!" అన్నాడు గుర్నాధం. "ఏమైనా వెంకటేశ్వర్లు పని వృత్తాంతంలో పరోక్షంగా మీ చెయీ కొంత వుందనాల్సిందే." అన్నాడు సీతాపతి.

"రామరామ! ఎంతమాటన్నారు! అన్యాయంగా ఒకరినోటికూడు కొడ్త వచ్చానంటే పురుగులుపడి పోతాను! ఆయన వ్యాపారం, సంస్థ మంచీ చెడులు నిర్ణయించుకునేది ఆ గురూజీగారే. నాకుమటుకు ఆయన వుప్పుతింటూ ఆయన కన్యాయం చేయడం వల్లకాని పనీ - నా మిత్రు లెవర్నికూడా అట్లా చెయ వద్దని పదేపదే చెబుతాను. నిజానికి మన ప్రెస్సూ, ఆఫీసుల్లో ఎన్నెన్ని దురాగతాలు జరుగుతున్నయ్యో చూసి, నేనెంతగా కుమిలిపోతున్నానో మీ కెట్లా తెలియ చెప్పను చెప్పండి?" అన్నాడు గుర్నాధం నిట్టూరుస్తూ.

"టేబిలు దగ్గిరదించిన తలఎత్తకుండా పనిచేసుకు పోతుంటంవల్ల మీకు తెలుస్తున్నన్ని విషయాలు తెలుసుకోలేక పోతున్నందుకు మిమ్మల్నిచూసి యీర్ష్యగావుంది. ఆమాటకొస్తే మీరు ఫలానా పనంటూ చేస్తున్నారనిగాని, మీ వుద్యోగం ఏదయిందనిగాని నా కివాళ్టివరకూ తెలియదంటే నమ్మండి" అన్నాడు సీతాపతి.

"నాబొంద నాకుమటుకు తెలిసేడ్సిందీ! పనివాళ్ళ పని కనిబెడ్తూ పనిచేస్తుండమనే ధ్వనితో గురూజీగారు ఏదో అంటే నే నేదో చేసుకుపోతూ మొదట్లో తికమక

పడ్డా. అయినా ఏ పనిచేసినా గురూజీగారి పనే చేసినట్టవుతుందిగా !"

ఎట్లాగవుతేనేం సీతాపతిని తెంచుకుని గురూజీ బంగళా కెదురుగావచ్చి నుంచుని ఒక్కసారి తృప్తిగా నిట్టూర్చాడు గుర్నాధం.

గురూజీ బంగళా మెయిన్ గేటు పక్క దిమ్మమీద గిల్టులో :—ది హౌవుస్ ఆఫ్-లోకబంధు పత్రిక, లోకబంధు ప్రెస్, లోకబంధు బుక్ పబ్లిషర్స్ - అని మెరుస్తున్న అక్షర పంక్తుల్ని చూసి తల ఆడించాడు గుర్నాధం.

గుర్నాధాన్ని చూసి 'ఠీక్ హై' అన్నాడు గేటు ఘూర్కా. గేటు ఘూర్కాను ఆప్యాయంగా ఆపాదమస్తకం చూస్తూ అవ్యక్తంగా నవ్వాడు గుర్నాధం.

పోర్టికోలో గురూజీ సెవెన్ నాట్ సెవెన్ సెవెన్ సెవెన్ గచ్చకాయరంగులో కన్నుల కింపుగా కనుపించక పోయేసరికి మనసు కాస్త చిబుకుమంది బుట్టతో పోర్టికోలో కొచ్చి నుంచున్న గుర్నాధానికి. గురూజీ బంగళాలోంచి బయటకు వెళ్ళేవేళలు షుమారుగా తెలుసు గుర్నాధానికి. అయినా వేళగాని వేళ యివాళ గురూజీ బయటికి పోయినట్టే వుంది.

ఇతరత్రా కూడా యివాళ పోర్టికో వెల్తిగావుంటం ఓ పక్క ఆశ్చర్యం కలిగించినా, గురూజీ పెంపుడు కుక్కలు పోర్టికో మెట్లమీద ముక్కుపుటలు ఎగరవేస్తూ గొంతుకూచుని వుండకపోటానికి యింకో పక్క గుర్నాధం తృప్తిపడకపోలేదు.

కాని, గుర్నాధం పొరపాటు పడ్డాడని చప్పున బయటపడింది.

అకస్మాత్తుగా టఫీమని రహస్యద్వారాలు తెరుచుకుని కత్తులు కటార్లతో అక్కడి కక్కడ ప్రత్యక్షమైనట్లు టాయితుపాకుల్తోనూ, కారు హారన్లతోనూ బండిచక్రాల్తోనూ స్తంభాలచాట్నుంచీ, గచ్చరుగుల మెట్లనుంచీ, క్రీపరు తీగెలచాట్నుంచీ సైజువారీగా అరడజను గురూజీ సంతతి బరబర వచ్చి గుర్నాధాన్ని వాటేసుకున్నారు.

"ఎందుకొచ్చా ?" అన్నాడు టాయిటుపాకి.

"ఏంతెచ్చా ?" అన్నాడింకో ఫుట్ బాల్ బనీను.

"ఏమిటాబుట్ట ?" అన్నాడింకో గడ్డి హాట్.

"అందులో దేంటి ?" అన్నదో ఎర్రబిళ్ళల గౌను.

"పప్పులుంటే పెత్తు !" అన్నదో బండిచక్రం. ఇంకో క్షణానికి గుర్నాధం చేతిల్లో పళ్ళబుట్ట పగిలి చిందరవందరగా పక్కలకు పోయినన్ని పోగా అందిన వాట్ని పీక్కుదింటం మొదలుపెట్టారా టాయిటుపాకీలు.

"రైలుబండి ఆడ్దాం !" అన్నాడు కారు హారన్ గుర్నాధం చొక్కా వెనక పట్టుకు వేళ్ళాడ్తూ.

"నేను గుర్రమెక్కుతా !" అన్నాడు టాయిటుపాకీ గుర్నాధం మెడమీద కెక్కుతూ.

"నేను యిమానం ఎక్కుతా !" అన్నాడు గడ్డిహాట్ గుర్నాధం బుజంకుండా పాకుతూ.

"ఆ జోబిలోదేంటి ఎల్లగా ?" అంది ఎర్రబిళ్లలగౌను గుర్నాధం జేబులో పెన్ను ఎగిరి వాటేసుకుని వేళ్లాడ్తూ.

ఇంకొంచెం సేపటికి ఒకజేబూ, ఒక చొక్కా చెయ్యీ, గూళ్లమధ్యా, పంచదిగువనా ఫర్రున చిరిగి చీలికలు పేలికలుగా నుంచున్నాడు గుర్నాధం !

"ఏయ్ ! పిల్లలూ ఏమిటా ఆటలు. ఎవరు? నువ్వా గుర్నాధం. నయం ఇంకెవరైనా పెద్దమనుషులొచ్చినా యింతేగా యీ పిల్లలూ ? వీళ్లుబాగా ఆటలాడిస్తున్నట్టున్నారే నిన్ను ?" అని పలికింది పోర్టికో స్తంభాల మధ్యకొచ్చి నుంచున్న గురూజీ విగ్రహం.

"అబ్బే-నేనంటే తమరి పిల్లలకు చనువు-"అన్నాడు గుర్నాధం చీలికలు పేలికల్ని సున్నితంగా సర్దుకుంటూ.